తర్వాత తేలింది ఏమిటంటే మేథమేటి కల్ కాలిక్యులేషన్స్‌లో దొర్లిన పొరపాటు వలన మొత్తం స్ట్రక్చరల్ డిజైనింగ్ తప్ప యింది. ముందు అనుకున్న ప్రకారం కట్టి ఉంటే ఆ బ్రిడ్జి నిలిచే ఛాన్సు అతి తక్కు వని తేలింది. దానితో అమెరికా మొత్తం ప్రకాష్ సింగ్ ప్రతిభని కొనియాడింది.

అతని గొప్పదనాన్ని గుర్తించిన తోటి విద్యార్థులు, ప్రొఫెసర్లు అతన్ని అమెరికా లోనే ఉండిపొమ్మని బతిమాలినా అతను ఒప్పుకోలేదు. చదువు పూర్తికాగానే తన దేశం వెళ్ళాల్సిందే అని తేల్చి చెప్పాడు.

ప్రకాష్‌సింగ్ చదువు పూర్తి కావటం, దేశానికి స్వాతంత్ర్యం రావటం ఒకేసారి జరిగాయి.

ఒక్క నిమిషం కూడా ఆలస్యం చేయ కుండా వెంటనే స్వదేశం చేరుకున్నాడు అతను. అప్పుడప్పుడే విదేశీ శృంఖలాల నుండి విముక్తి అయిన దేశం అభివృద్ధి పథంలో నడవటానికి ఎదురు చూస్తోంది.

అతని కంటే ముందు అతని పేరు ప్రఖ్యాతులు ఇక్కడికి చేరాయి. ఎన్నో కంపెనీలు అతన్ని తమ దగ్గర పనిచేయ మని అడిగాయి.

అయితే ప్రకాష్ సింగ్ ఆలోచనలు వేరుగా ఉన్నాయి.

అమెరికాలో జరుగుతున్న అభివృద్ధి ఇక్కడ సాధించాలంటే ఒక్కరితో సాధ్యం కాదని అతనికి తెలుసు. అందుకే ఒక గొప్ప కంపెనీని తయారు చేయాలనుకు న్నాడు.

తన పేరు మీద పి.ఎస్ కన్‌స్ట్రక్షన్స్ అని కొత్త కంపెనీ పెట్టాడు. దానిని ముందు మనదేశంలో, తర్వాత ప్రపంచవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మక కంపెనీగా తీర్చిదిద్దాడు.

కంపెనీ కోసం పాటుపడుతూనే దేశానికి అవసరమైన ఏ పని అయినా లాభ నష్టా లతో సంబంధం లేకుండా చేస్తూ వచ్చాడు. ఆయన సిన్సియారిటీని ప్రజలు, ప్రభుత్వం అందరూ గుర్తించారు. అనేక బిరుదులతో సత్కరించారు.

ప్రస్తుతం ఆయన వృద్ధాప్యం వల్ల వచ్చే అనేక సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ మధ్య ఆరోగ్యం హఠాత్తుగా క్షీణించ టంతో ఈ హాస్పిటల్లో చేర్చారు.

తొంభై ఏళ్ళ వయసులో కూడా ఆయన అనారోగ్య వార్తలతో కంపెనీ షేరు విలువ ఇరవైశాతం పడిపోయిందంటే మార్కెట్లో ఆయనమీద ఉన్న నమ్మకమేమిటో తెలు స్తుంది.

ఆయన వారసులు తక్కువ వారేమీ కాదు. కంపెనీని ప్రాణప్రదంగా చూసుకుం టున్నారు. పైగా కేవలం తన కుటుంబం లోని వారినే కాక, నైపుణ్యం ఉన్న ప్రొఫె షనల్స్ ఎక్కడ ఉన్నా ప్రోత్సహిస్తూ పైకి తీసుకువచ్చాడు ఆయన.

ప్రస్తుతం ఆయన శరీరం ఆయనకు సహకరించటం లేదేమో కానీ మేధస్సు మాత్రం చురుకుదనం కోల్పోలేదు.

స్వదేష్ సింగ్ ఆయన కొడుకు. కంపెనీ వ్యవహారాలన్నీ చూస్తున్నది అతనే! దేశం మీద అభిమానంతో కొడుక్కి ఆ పేరు పెట్టుకున్నాడు ప్రకాష్ సింగ్.

ఆ రోజు ఉదయాన్నే హాస్పిటల్‌కు వచ్చాడు స్వదేష్ సింగ్. తండ్రి అనారో గ్యంతో హాస్పిటల్లో చేరిన దగ్గర నుండి కంపెనీ వ్యవహారాలు పూర్తిగా అతనే చూసుకుంటున్నాడు. ఎప్పటి నుండో కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరి స్తున్నా, స్వతంత్రంగా తనే ఈ వ్యవహారా లన్నీ చూడవలసి రావటంతో ఒకింత ఒత్తి డిలో ఉన్నాడు అతను. అదే ఇంతకు ముందు అయితే ఏ సమస్య వచ్చినా వెను తిరిగి చూడటానికి పెద్ద దిక్కులాగా తండ్రి ఉండేవాడు.

"నాన్నగారూ! ఇవిగో ఈరోజు పేపర్లు"

ఆ రోజు వచ్చిన అనేక దిన పత్రికలు అక్కడ పెడుతూ అన్నాడు స్వదేష్ సింగ్.

"ఏమన్నా ముఖ్యమయిన వార్తలు ఉన్నాయా? " నీరసంగానే అయినా స్పష్టంగా మాట్లాడుతున్నాడు ప్రకాష్ సింగ్.

"ఈ రోజు ముంబయిలో మన కంపెనీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్మించిన ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవం చేసుకోబోతోంది. ఎయిర్‌పోర్టుని నగరానికి అనుసంధానం చేస్తూ నిర్మించిన టూ టయర్ ఫ్లై ఓవర్ ఒక ఇంజినీరింగ్ మార్వెల్ అని అందరూ పొగుడుతున్నారు. దీని ప్రారంభంతో ముంబయి ట్రాఫిక్ సమస్యలు కొంత వరకూ తగ్గుతాయి. ఈ రోజు చాలా పేపర్లలో దాని గురించే రాశారు"

తన కంపెనీ గురించిన వార్తలు దిన పత్రికల్లో ఉన్నాయని తెలియటంతో లేని ఓపిక తెచ్చుకుని పేపర్లు తిరగేయటం ప్రారంభించాడు ప్రకాష్ సింగ్. అన్ని పేపర్లలో ప్రకాష్ సింగ్ ఫొటో ప్రముఖంగా ప్రచురించారు. ఆయన ఇంతకుముందు సాధించిన విజయాల గురించి వివరంగా రాశారు. వాటన్నిటిలో ఏమి రాసి ఉంటారో ఆయనకు బాగా తెలుసు. తన గురించిన పొగడ్తలతో అవన్నీ నిండిపోయి ఉంటాయి.

ఒక పక్క తన కంపెనీ సాధించిన విజయాలకు గర్వంగా ఉన్నా, అవన్నీ చదివే ఓపిక లేక పక్కన పడేశాడు. తరువాత ఆయన తన ఫేవరేట్ పత్రిక అయిన 'సివిల్ ఇంజినీర్స్ టుడే' అన్న మేగజైన్ చేతిలోకి తీసుకున్నాడు. ఆయన ఆ పత్రికను అనేక సంవత్సరాలుగా ఫాలో అవుతున్నాడు.

కాజువల్‌గా పేజీలు తిప్పుతున్న ఆయన హఠాత్తుగా ఆగిపోయాడు. 'ప్రకాష్ సింగ్ గర్వం దేశానికి అవమానం కాబోతుందా? ' అన్న శీర్షికతో ఒక కథనం ప్రచురించబడి ఉంది.

"ఏమిటిది? " అడిగాడాయన కొడుకుని చూస్తూ. "దీన్ని చూశావా? "

"నేనే కాదు. మన కంపెనీలో అందరం చూశాం.."

"ఎవరిది రాసింది? "

"ఎవరో బచ్చా! ఐ.ఐ.టి.లో చదువుతు

న్నాడంట"

ప్రకాష్ సింగ్ తన మీద పొగడ్తలతో కూడిన ఆర్టికల్స్ అన్నిటినీ పక్కన పెట్టి తనను విమర్శిస్తూ రాసిన ఆ ఆర్టికల్ చదవటం మొదలు పెట్టాడు.

దేశంలోనే మొదటిసారి కడుతున్న టూ టయర్ ఫ్లైఓవర్ డిజైనింగ్‌లో లోపం ఉందని అభియోగం మోపాడు ఆ కుర్రాడు. ఎన్నోసార్లు ఆ విషయం కంపెనీకి చెప్పినా ఎవరూ పట్టించుకోలేదని, అలాగే ఆ ప్రాజెక్ట్‌కి సంబంధించిన స్ట్రక్చరల్ డిజైనులు తనకు చూపించటానికి కంపెనీ అంగీకరించటం లేదని ఆరోపణలు చేశాడు. కంపెనీ అలసత్వం వలన ప్రాజెక్ట్ దెబ్బతింటే అది కేవలం పి.ఎస్. కన్‌స్ట్రక్షన్స్ పరువుప్రతిష్టల సమస్యగా మిగిలిపోదనీ.. ఇంత చిన్న ప్రాజెక్టును పూర్తి చేయలేకపోయినందుకు దేశ ప్రతిష్టే మసకబారుతుందనీ రాశాడు.

అతను చర్చించిన మిగిలిన విషయాల సంగతెలా ఉన్నా తన కంపెనీ వలన దేశ ప్రతిష్టకు భంగం కలుగుతుందన్న ఆరోపణ ప్రకాష్ సింగ్ మనసును చివుక్కుమనిపించింది.

"ఇదంతా నిజమేనా?" కొడుకుని అడిగాడు ఆయన.

"అతని అభియోగాలన్నీ మన ఇంజినీర్లు ఒకటికి రెండుసార్లు పరిశీలించారు. ఎవరికీ ఏ లోపమూ కనపడలేదు. అతను వ్యక్తిగత ప్రచారం కోసం మన మీద బురద చల్లుతున్నాడు తప్ప మరే కారణం లేదు"

అభావంగా చూశాడు ప్రకాష్ సింగ్. "మరి ఈ విషయం ఇంతవరకు నాకెందుకు చెప్పలేదు?"

"ఇది మీ వరకూ రావలసిన విషయం కాదని అనుకున్నాం"

"ఆ ప్రాజెక్టుకు సంబంధించిన స్ట్రక్చర్ డిజైన్లు, సాయిల్ టెస్ట్ రిపోర్టులు ఒకసారి చూపించు"

స్వదేష్ సింగ్ మనసులో విసుక్కున్నా బయటపడలేదు. 'ఇప్పుడీయనకి ఆ వివరాలన్నీ ఎందుకో?' అనుకున్నా, పెద్దాయన మాటకు ఎదురు చెప్పే అలవాటు లేదు కాబట్టి, "ఇప్పుడే పంపిస్తాను నాన్నగారూ" అని బయటకు వెళ్ళిపోయాడు.

అప్పటి నుండి చాలా అసహనంగా గడిపాడు ప్రకాష్ సింగ్.

ఆయన్ని పర్యవేక్షిస్తున్న డాక్టర్లకు కూడా ఆయన ఎందుకంత ఆందోళనగా ఉన్నాడో అర్థం కాలేదు. ఎంతమంది ఎన్ని రకాలుగా ప్రశ్నించినా ఆయన సమాధానం చెప్పలేదు.

తమ ఆఫీసుకు చేరుకున్న స్వదేష్ సింగ్ మరొక గంట తరువాత తన తండ్రి అడిగిన ఫైల్ బయటకు తీయించాడు. దానిని తీసుకుని హాస్పిటల్‌కి బయలుదేరుదామనుకున్నంతలో అర్జెంటు పని ఒకటి వచ్చింది. దానితో ఆ ఫైల్ డ్రైవర్‌కి ఇచ్చి పంపాడు.

డ్రైవర్ తెచ్చిన ఫైల్ ఆత్రంగా అందుకున్నాడు ప్రకాష్ సింగ్.

చదవటానికి వీలుగా బెడ్ ఎత్తు మార్చమని సైగ చేయటంతో డ్రైవర్ నర్సును పిలుచుకు వచ్చాడు. ఆమె వచ్చి బెడ్ భాగం ఎత్తుగా వచ్చేలా మంచాన్ని సరిచేసింది.

అందరినీ బయటకు వెళ్ళమని ఆయన ఆ ఫైల్ చదవటంలో మునిగి పోయాడు.

క్లిష్టమయిన డ్రాయింగులను, కాలిక్యులేషన్లను అర్థం చేసుకోవటానికి ఆయనకు పది నిమిషాలు కూడా పట్టలేదు. తరువాత ఫైలంతా ఒకసారి తిప్పి చూశాడు. ఆయనకు కూడా అందులో ఏ పొరపాటూ కనపడలేదు. దేశంలోనే అత్యుత్తమమయిన ఇంజినీర్లు తయారు చేసిన రిపోర్టు

అది. తప్పులుండటానికి.. అందులోనూ ఆ కుర్రాడు చెప్పినటువంటి బ్లండర్ ఉండటానికి అవకాశం లేదు. అయినా ఎందుకో తెలియదు.. ప్రకాష్ సింగ్ మనసు ఆ కుర్రవాడినే సమర్థిస్తోంది. ఆయనకు ఆ కుర్రవాడిలో అరవైఐదు సంవత్సరాల క్రితంనాటి తన ఛాయలు కనిపిస్తున్నాయి. అనవసరమయిన భేషజాలకు పోకుండా ఆ కుర్రవాడిని పిలిపించి, అతను అడిగిన డిజైనులు చూపించి, తీరికగా మాట్లాడి ఉంటే ఎలా ఉండేదో? కానీ ఇప్పుడు అంత తీరిక ఎవరికి ఉంది?

అయినా ప్రకాష్ సింగ్ మరలా ఆ ఫైల్ దీక్షగా చదవటం మొదలుపెట్టాడు. ఆయనకి ఆ కాస్త శ్రమకే గుండె వేగంగా కొట్టుకుంటోంది. ఆయనకు నెమ్మదిగా తమ డిజైన్లలో ఏదైనా లోపం ఉంటుందేమో అన్న అనుమానం నెమ్మదిగా తొలగిపోతోంది.

తనుకూడా ఇలాంటి లోపాన్ని ఎత్తిచూపే ఒక్కసారిగా లైమ్‌లైట్‌లోకి వచ్చాడు. ఇప్పుడు ఈ కుర్రవాడు ఎవరో కానీ ఆ ప్రయోగం తన కంపెనీ మీదే చేశాడా?

కానీ ఆ కుర్రాడు చెప్పింది నిజమై తాము ఎవరం ఈ విషయం పట్టించుకోక ఏదైనా ప్రమాదం జరిగితే ఆ కుర్రాడికి జరిగే నష్టం ఏమీ ఉండదు. పైగా లాభం కూడా! అదే జరిగితే తన కంపెనీ పరిస్థితి ఏమవుతుంది? తమ పొరపాటు వలన వందలాది ప్రాణాలు ప్రమాదంలో పడితే ఇక తన కంపెనీ కోలుకోగలదా? ఇలాంటి ఆలోచనల మధ్య ఆయన లేని ఓపిక తెచ్చుకుని ఫైల్ పరిశీలిస్తున్నాడు.

ఇంతలో ఆయన దృష్టి యాదృచ్ఛికంగా మేథమేటికల్ కాలిక్యులేషన్స్‌లో చూపించిన ఫ్లై ఓవర్ కోణంమీద పడింది. అంతే! ఆయన షాకయ్యాడు. 36 డిగ్రీల కోణం ఉండవలసిన చోట ఒక అంకె ఎగిరిపోయి 6 డిగ్రీలని ఫీడ్ అయింది. మొత్తం డిజైనంతా ఆ లెక్కల మీద ఆధారపడే జరిగింది.

ఆ పొరపాటు ఫలితం తలచుకున్న ఆయన ఒక చల్లని మేఘం తనని చుట్టుముట్టినట్లు వణికాడు.

'ఆపాలి' అనుకున్నాడాయన. 'ఎలాగయినా ఫ్లైఓవర్ ప్రారంభోత్సవాన్ని ఆపాలి. డిజైన్ లోపాన్ని సరిచేసి ఫ్లైఓవర్ మీద ప్రయాణం ప్రమాద రహితం అనుకున్న తరువాతే దానిని జాతికి అంకితం చేయాలి. లోపాన్ని సరిదిద్దటానికి ఎంత ఖర్చయినా తన కంపెనీనే భరిస్తుంది..' అని ఆలోచిస్తూ నర్సుని పిలవటానికి అరేంజ్ చేసిన బెల్‌వైపు చేయి జరిపాడు.

అయితే ఆ చిన్న పనే ఆయనకు సాధ్యం కావటం లేదు. శరీరం పెద్ద షాకుకు గురయినట్లు వణుకుతోంది. చెయ్యి బెల్‌వరకూ వెళ్ళేందుకు కూడా ఆయన శరీరం ఆయనకు సహకరించటం లేదు.

తన ఆఖరి క్షణాలు ఆసన్నమయ్యాయని ఆయనకు అర్థం అయింది. ఎంత ప్రయత్నించినా తన దగ్గర ఉన్న సమాచారాన్ని బయటకు చేరవేసే మార్గం కనపడటం